ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు

కలికిరి జయహో బీసీ సభలో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి



బీసీలకు కుర్చీలు లేని పదవులిచ్చారు

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఫిబ్రవరి 14: ఆది నుంచి బీసీల పట్ల వైసీపీ ప్రభుత్వ మొసలి కన్నీళ్లు కార్చుతూ నయవంచనకు పాల్పడుతోందని, వెనుకబడిన కులాలు, వర్గాలకు ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. కార్యాలయాలు, కుర్చీలు లేకుండా బీసీలకు పదవులిచ్చి ఈ ఐదేళ్లు కపట ప్రేమ ప్రదర్శించారని ఆయన విమర్శించారు. కలికిరి ఏహెచ్‌సీ కల్యాణ మండపంలో బుధవారం జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడుతూ బీసీల్లో ఉన్న వివిధ కులాల పేరుతో కార్పొరేషన్లు సృష్టించి అనంతరం గాలికి వదిలేశారని చెప్పారు. బీసీలకు గుర్తింపు తెచ్చిందీ, పదవుల్లో కూర్చోబెట్టి ఉన్నత స్థానాల్లోకి తీసుకెళ్లిందీ టీడీపీ మాత్రమేనని గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లలో భారీగా కోత పెట్టారని చెప్పారు. టీడీపీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేంద్రయాదవ్ మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. న్యాయంగా బీసీలకు అందాల్సిన వేలాది కోట్ల రూపాయల నిధులను జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టం తీసుకురానున్నట్లు తెలిపారు. హార్సిలీహిల్స్ భూమి పరులపాలు కాకుండా కాపాడటానికి ఉద్యమిస్తామని హెచ్చరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, బీసీ జిల్లా సాధికారిక సమితి అధ్యక్షుడు జనార్ధన గౌడ్, జిల్లా కార్యదర్శి సిద్దప్ప, జిల్లా ఉప్పర సంఘ అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా బీసీ నాయకులు త్యాగరాజు, దుర్గాప్రసాద్, మండల జనసేన అధ్యక్షుడు అస్లాం, వేంపల్లె అబ్దుల్ ఖాదర్ ప్రసంగించారు. మాజీ ఎంపీపీ రహంతుల్లా, రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, జ్ఞానమూర్తి, మహ్మదాలి, షబ్బీర్ హుస్సేన్, సర్పంచులు రెడ్డిరాము, సైఫుల్లా, శశికళ వెంకట్రమణ, యల్లయ్య, జాహీదా, ఎంపీటీసీలు చిరంజీవమ్మ, చిన్నరెడ్డెయ్య, మాజీ జడ్పీటీసీ మాలతి, లేపాక్షి అస్లాం పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన చర్యలు చేపట్టండి

- ఈవీఎంలు భద్రపరచే భవనాలను పరిశీలించిన కలెక్టర్, జేసీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 14: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అనంతరం ఈవీఎంల భద్రతతో పాటు కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేయడంలో గల అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై బుధవారం కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులతో కలిసి రాయచోటి పట్టణంలోని శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల, ఇతర జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల మ్యాపులను, కళాశాల విస్తీర్ణం, కళాశాలలోని తరగతి గదులు, ల్యాబొరేటరీలు, మొదటి అంతస్తులో గల రూములను పరిశీలించారు. ఇందులో ఈవీఎంల భద్రత, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్స్ ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. కళాశాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో ప్రతి గదిని గుర్తించగలిగేలా పేర్లతో సహా స్పష్టమైన మ్యాపును రూపొందించి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సర్వే శాఖ జిల్లా కోశాధికారి జయరాజ్, ఆర్‌అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



అర్హత లేకపోయినా అందలం..

- ఆపై అందరిపైనా పెత్తనం..
- అవినీతి ఆరోపణలు అదనం
- అయినా ఈగ కూడా వాలదు
- ఆ అధికారిని రక్షిస్తున్న గాడ్‌ఫాదర్ ఎవరో?



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఏ ప్రభుత్వ శాఖలో అయినా అర్హత ఉన్న వాళ్లనే జిల్లా స్థాయిలో ఉన్నతాధికారిగా నియమిస్తారు. ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో అర్హత లేని వ్యక్తిని నియమించాల్సి వచ్చినా తాత్కాలికంగా మాత్రమే ఉంచుతారు. అర్హత ఉన్న వ్యక్తి రాగానే అతడిని పక్కన పెట్టేస్తారు. అయితే జిల్లాలో ఓ ముఖ్యమైన శాఖలో ఆ పదవికి తగిన అర్హతలు లేకపోయినా, అర్హతలు ఉన్న అధికారులు అందుబాటులో ఉన్నా.. ఇతడినే రెండు సంవత్సరాలుగా జిల్లా అధికారిగా కొనసాగిస్తున్నారు. అర్హతలు లేకపోయినా.. ఇతడిని అంత పెద్ద కుర్చీలో కూర్చోబెట్టారు.. ఈయనకేమైనా చాలా ప్రత్యేకతలు ఉన్నాయేమో.. అనుకుంటే మనం పొరపడ్డట్టే.. అతడిపై లెక్కకు మించి అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆ ఆరోపణలు వాస్తవం అని కూడా తేలాయి. అయినా అతడి మీద కనీసం ఈగ కూడా వాలడం లేదు. అధికారులో...? ప్రజాప్రతినిధులో..? ఎవరో గాడ్‌ఫాదర్ అతన్ని రక్షిస్తున్నారనే పుకార్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ అధికారి వ్యవహారమే జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత కోసం పథకాలు అమలు చేసే డీఆర్‌డీఏ శాఖలో ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారులో..? గ్రూపు-1 అధికారులనో..? నియమిస్తారు. జిల్లాలో లక్షలాది మంది మహిళలు స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉంటారు. వేలాది స్వయం సహాయక సంఘాలను సమన్వంతో పనిచేయించడంతో పాటు పథకాల అమలులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడడం ముఖ్యం. అయితే అటువంటి ఎంతో ప్రాధాన్యత కలిగిన డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా అర్హత లేని హెచ్‌ఆర్ పాలసీ జూనియర్ సత్యనారాయణను పీడీగా నియమించారు. వెలుగు ప్రాజెక్టులో హెచ్‌ఆర్ పాలసీ కింద పనిచేస్తున్న డీపీఎంల కంటే తక్కువ స్థాయి అధికారిని పీడీగా నియమించారు. ప్రస్తుతం జిల్లాలో అదే శాఖలో గెజిటెడ్ హోదా ఉన్న అధికారులు ఉన్నప్పటికీ కొత్త జిల్లా ఏర్పడినప్పటి నుంచీ ఇతడినే కొనసాగిస్తున్నారు. అన్నమయ్య జిల్లా ఏర్పడినపుడు పరిపాలనా సౌలభ్యం కోసం అప్పటికే ఏరియా కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఇతడిని కొత్త పీడీ వచ్చే వరకు బాధ్యతలు చూడమని పీడీగా నియమించారు. ఇతను కాంట్రాక్టు బేసిక్‌తో పనిచేసే ఉద్యోగి కాదు.. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కూడా కాదు. అయినా అయితే 2022 డిసెంబరులో అతనికే పూర్తి అదనపు బాధ్యతలతో పీడీగా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారు. అప్పటికే ఆ శాఖలో గెజిటెడ్ హోదాలో రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. జిల్లాలో గ్రూపు-1 అధికారులు వందల మంది ఉన్నారు.. మరెందుకో.. ? వారికి పీడీగా బాధ్యతలు అప్పగించకుండా ఇతడికే పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టారు. రెగ్యులర్ ఉద్యోగులు సైతం ఇతడి కింద సబార్డినేటర్లుగా పనిచేయాల్సి వస్తుండడంతో ఆ శాఖలోని ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. బదిలీ నిబంధనలు ఉల్లంఘించి.. ఇతను రాయచోటి ఏరియా కో-ఆర్డినేటర్‌గా ఇప్పటికే ఐదు సంవత్సరాలుగా పనిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆరోపణల కుప్పలు..

ఇతడిపై ఆరోపణలకు కొదవే లేదని ఆ శాఖలోని ఉద్యోగులు బహిరంగంగానే చెబుతున్నారు. సుండుపల్లె మండల పరిధిలో గతంలో ఒక సొసైటీ ఏర్పాటు చేసి ఇసుక క్వారీలను మహిళా సంఘాలు నిర్వహించాయి. ఈ క్వారీల నిర్వహణలో పెద్ద మొత్తంలో ఈయన డబ్బు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై ఆరోపణలు వచ్చినా తూతూమంత్రంగా విచారణ జరిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మహిళలు ఆర్థిక స్వావలంబన కోసం స్త్రీ నిధి బ్యాంకు నుంచి కోట్ల రూపాయలు స్వయం సహాయక సంఘాల మహిళలు రుణాలు తీసుకుని తిరిగి చెల్లిస్తారు. ఇలా చెల్లించే మొత్తాన్ని బ్యాంకుల్లో జమ చేయకుండా సుమారు కోటి రూపాయల వరకు కాజేసినట్లు ఉమ్మడి కడప జిల్లాలో డీఆర్‌డీఏ సిబ్బందిపై ఆరోపణలు వచ్చాయి. ఇందులో ఇతడి పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కమలాపురం ఏరియా కో-ఆర్డినేటర్‌గా ఇతను 2014 నుంచి 2019 వరకు విధులు నిర్వహించారు. ఈ సమయంలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కడప జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఇతడికి నోటీసులు ఇచ్చారు. నిధుల గోల్‌మాల్ వెనుక ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొన్న ఉద్యోగిని తాను లక్షల రూపాయలు ఇతనికి ఇచ్చినట్లు విచారణలో వెల్లడైందని అప్పటి విచారణాధికారి తన నివేదికలో పేర్కొన్నారు. విధుల్లో ఇతడి నిర్లక్ష్యం కారణంగానే ఇక్కడ నిధుల గోల్‌మాల్ జరిగిందని అధికారుల విచారణలో వెల్లడైంది. అదేవిధంగా అన్నమయ్య జిల్లాలోనూ స్త్రీ నిధి బ్యాంకు డబ్బుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. లక్షల రూపాయలు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా తన కింది సిబ్బందిపై ఆరోపణలు వస్తే వారి దగ్గర డబ్బు వసూలు చేస్తాడనే ఆరోపణలు ఉన్నాయి. ఇతడిపై ఇన్ని ఆరోపణలు వస్తున్నా.. ఆ ఆరోపణలు విచారణలో వాస్తవం అని తేలుతున్నా.. ఎందుకనో.. ఇతనిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం ఈగ కూడా వాలడం లేదు. ఇతడి వెనుక ఎవరో అన్ని విధాలా పలుకుబడి ఉన్న వ్యక్తులు ఉండి.. రక్షిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి.. ఇతడిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో... ? వేచి చూడాల్సిందే..

నిధుల స్వాహాతో నాకు ఎటువంటి సంబంధం లేదు..

కమలాపురంలో జరిగిన స్త్రీ నిధి నిధుల స్వాహా వ్యవహారంలో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను అక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయిన తర్వాత ఆ సంఘటన జరిగింది. అక్కడి సిబ్బంది కొంతమంది తమ వ్యక్తిగత ఖాతాల్లోకి నిధులు మళ్లించుకున్నారు. నా 20 ఏళ్ల సర్వీసులో ఎటువంటి తప్పు చేయలేదు. మా శాఖలోని కొంతమంది నాపైన వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేస్తున్నారు. సుండుపల్లె ఇసుక కుంభకోణం జరిగిన సమయంలో నేను ఇక్కడ లేను.

- సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ

నలుగురు పోలీసుల బదిలీ

కలికిరి, ఫిబ్రవరి 14: కలికిరి పోలీసుస్టేషన్ నుంచి నలుగురు పోలీసు సిబ్బంది ఆకస్మికంగా బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. పరిపాలనాపరమైన కారణాలతో ఎస్పీ కృష్ణారావు ఈ నలుగురినీ బదిలీ చేశారు. బదిలీ అయిన వారిలో ఏఎస్ఐ మధుసూదనాచారి, హెడ్ కానిస్టేబుళ్లు మదనమోహన్ రెడ్డి, మనోహర్‌లను బుధవారం రిలీవ్ చేసినట్లు కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్.మోహన్ తెలిపారు. బదిలీ అయిన మరో కానిస్టేబుల్ అమరనాథ్‌ను రిలీవ్ చేయాల్సి ఉందని ఆయన చెప్పారు. కాగా ఏఎస్ఐ మధుసూదనాచారి కలికిరిలో చేరి రెండేళ్లు కావస్తోంది. ఈయన్ను పెద్దమండెంకు బదిలీ చేశారు. రామసముద్రంకు బదిలీ అయిన హెచ్‌సీ మనోహర్‌కు మూడేళ్లు మాత్రం పూర్తయ్యాయి. మరో హెచ్‌సీ మదనమోహన్‌రెడ్డి కేవలం మూడు నెలల క్రితమే ఇక్కడ చేరారు. ఇంతలోనే మదనపల్లె తాలూకా స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇంకా రిలీవ్ కావలసిన అమరనాథరెడ్డికి మాత్రం ఐదేళ్లు పూర్తయ్యాయి. ఈయనను వాల్మీకిపురం బదిలీ చేశారు. మొదటి ముగ్గురినీ స్వల్ప కాలంలో బదిలీ చేయడం కేవలం రాజకీయ కారణాలతో మాత్రమే జరిగిందని చెబుతున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

- ఫెన్సింగ్ వేసి పంటల సాగు
- పట్టా భూమికి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైతే పెట్టింది ప్రభుత్వ భూమిలో..
- తొలగించాలని తహశీల్దారు ఆదేశించినా పట్టించుకోని ఏఈ



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి

పుల్లంపేట, ఫిబ్రవరి 14: పుల్లంపేట మండలంలో కబ్జాదారులు కుంటలు, గుట్టలు, చెరువులు, ప్రభుత్వ భూములు దేనినీ వదలడం లేదు. కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లు కోట్లాది రూపాయల విలువ చేసే భూములను దర్జాగా కాజేస్తున్నారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ప్రభుత్వ భూమిని కాపాడేందుకు రెవెన్యూ సమస్యలు తీర్చేందుకు విలేజ్ రెవెన్యూ అధికారి ఉన్నారు. అతడి కింద రెవెన్యూ సహాయకులు ప్రతి గ్రామానికి పనిచేస్తున్నారు. ఇంతమంది ఉన్నా కబ్జాదారులు మాత్రం ఎంచక్కా ప్రభుత్వ భూములను కబ్జా చేసేస్తున్నారు. గ్రామ రెవెన్యూ అధికారులకు లక్షలాది రూపాయలు ముట్టచెప్పి కోట్ల రూపాయల ప్రభుత్వ భూములు కాజేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామ రెవెన్యూ అధికారులకు తెలియకుండా ఎక్కడా కబ్జాలు జరగడం లేదని అందరికీ తెలిసిందే. గ్రామ రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తుండటంతో పుల్లంపేట మండలంలో ప్రభుత్వ భూములు, కుంటలు, గుట్టల కబ్జా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. పుల్లంపేట మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో సర్వేనెంబరు 100లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి పక్కనే 98 సర్వే నెంబరులో కూడా ప్రభుత్వ భూమి ఉంది. దీనికి మూడు వైపులా దిగువపల్లె కాలనీ, వడ్డికాలనీ, ఎస్సీ కాలనీలున్నాయి. వడ్డికాలనీకి చెందిన ఓ వ్యక్తి ఏకంగా రెండు ఎకరాలకు పైగా కబ్జా చేసి దానికి ఫెన్సింగ్ తీసి డ్రిప్ పెట్టి మామిడి మొక్కలు నాటాడు. ప్రభుత్వ భూమి అయినా ఎంచక్కా బోరు కూడా వేశాడు. అదీ రెవెన్యూ అధికారుల చొరవతోనే. ఇంకేముంది ఎక్కడో కొమ్మనవారిపల్లె గ్రామ పొలాలకు మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌ను తన ఇంటి పక్కనే ఉన్న కబ్జా భూమిలో పెట్టేశాడు. ఇక్కడ సెంటు 50 వేల నుంచి లక్ష రూపాయల ధర ఉంది. రెండు ఎకరాలు కలిపితే కోటి రూపాయల పైమాటే. పుల్లంపేటకు అతి దగ్గరగా ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడలేని అధికారులు మారుమూల ప్రాంతాల్లో ఎలా కాపాడతారు.. వారి పనితీరు ఎలా ఉందో... దీనిని బట్టి చూస్తే అర్థమవుతుంది.

కొత్తపేట పంచాయతీలో ఇప్పటికే 60 మందికి పైగా ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు చేసుకుని తహశీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇంకా సుమారు 50 మందికి పైగా నిరుపేదలు ఇంటి స్థలాలు లేక గగ్గోలు పెడుతున్నారు. 100 సర్వే నెంబరులో కబ్జాకు గురైన రెండు ఎకరాలకు పక్కనే 98 సర్వే నెంబరు ఉంది. ఇక్కడ ఇటీవల ఇంటి పట్టాలు ఇచ్చేందుకు సర్వే అధికారులు సర్వే చేసి స్కెచ్ కూడా పూర్తి చేశారు. ఇక్కడ కొద్దిపాటి భూమి ఉండటంతో 22 మందికి పట్టాలు ఇచ్చేందుకు అన్నీ సిద్ధం చేసినట్లు తెలిసింది. కాగా ఇందులో ఇప్పటికే ఒకరు ఇంటి నిర్మాణం కూడా చేపట్టారు. ప్రభుత్వం ప్రతి నిరుపేదకు ఇంటి పట్టాలు అడిగిన వెంటనే ఇవ్వాలని చెబుతున్నా స్థలం లేదని స్థలం కోసం రెవెన్యూ అధికారులు అన్వేషిస్తున్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురైన విషయం గ్రామ రెవెన్యూ అధికారులు తహశీల్దారు వరకు తీసుకుపోవడం లేదు. ఇంటి స్థలాలకు ప్రభుత్వ భూమి లేదని ఒక మాటతో కొట్టి పడేస్తున్నారు. లక్షలాది రూపాయలు కబ్జాదారుల నుంచి పొంది కోట్ల రూపాయల భూమిని కట్టబెట్టి ప్రభుత్వానికి నష్టం చేకూర్చడమే కాకుండా ఇంటి స్థలాలు లేక నిరుపేదల కడుపుకొడుతున్నారని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. సర్వే నెంబరు 98లో ప్రభుత్వ భూమి ఉందని గుర్తించిన అధికారులు పక్కనే సర్వే నెంబరు 100లో ఉన్న రెండు ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని గుర్తించలేదంటే అక్కడ ఏమి జరిగిందో ఇట్టే తెలిసిపోతుంది. నిరుపేదలు ఇంటి స్థలం కోసం సెంటు భూమి ఆక్రమించుకుంటే ఇబ్బందులు పెడుతున్న రెవెన్యూ అధికారులు ఎకరాలకు ఎకరాలు కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వాళ్ల జోలికి మాత్రం వెళ్లడం లేదనే విమర్శలున్నాయి. ఈ ప్రభుత్వ భూమి ఆక్రమణలో లక్షలాది రూపాయలు చేతులు మారడమే కాక రెవెన్యూ అధికారుల అండదండలు కబ్జారాయుళ్లకు పుష్కలంగా ఉన్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ భూమి ఆక్రమణపై తహశీల్దారుకు ఫిర్యాదులు అందడంతో ఆయన పరిశీలించి ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ప్రభుత్వ భూమిలో ట్రాన్స్‌ఫార్మర్ ఎలా పెట్టారని ట్రాన్స్‌కో అధికారులను ప్రశ్నించారు. తీరా విచారణలో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైంది కొమ్మనవారిపల్లె దగ్గర అయితే పెట్టింది మాత్రం ప్రభుత్వ భూమిలో అని గుర్తించారు. తహశీల్దారు, రెవెన్యూ అధికారులు వచ్చి కబ్జా భూమిని పరిశీలించి ప్రభుత్వ భూమిలో ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్‌కు వారం రోజులుగా చెబుతున్నా కాలయాపన చేస్తున్నారే కానీ రేపు మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. దీనిపై తహశీల్దారు నరసింహకుమార్ మాట్లాడుతూ ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్‌కు సర్వే నెంబరు 100లో ప్రభుత్వ భూమి కబ్జా చేశారని అందులో ట్రాన్స్‌ఫార్మర్ తొలగించామని చెబుతున్నామని, కబ్జా చేసిన వారికి ఏడవ నోటీసు అందచేశామని తెలిపారు.



కబ్జా భూమికి పక్కనే చేపట్టిన ఇంటి నిర్మాణం



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం

- తమ భూమిని వేరే వారికి రాసిచ్చారని బాధితుడి ఆవేదన
- అధికారులకు సమస్య విన్నవించినా స్పందన కరువు
- న్యాయం జరగదన్న ఆవేదనతోనే చనిపోవాలనుకున్నా
- బాధితుడు అర్షద్ అహ్మద్



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న అర్షద్‌ను అడ్డుకుంటున్న పోలీసు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 14: జిల్లా కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చినా, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని మనస్థాపానికి గురైన అర్షద్ అహ్మద్ అనే వ్యక్తి బుధవారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయచోటి పట్టణ పరిధిలోని గున్నికుంట్ల రోడ్డులో సర్వే నెంబరు 800లో 30 సంవత్సరాలుగా తన తండ్రి సులేమాన్ పేరుపై ఉన్న 75 సెంట్ల స్థలాన్ని రెవెన్యూ అధికారులు వేరే వారి పేరుతో ఆన్‌లైన్ చేశారని, దీని కోసం తన తండ్రి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి తిరిగి మరణించాడన్నారు. ఆ స్థలాన్ని తన పేరుతో మార్చాలని సంవత్సరాల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఆర్ఐ, వీఆర్వోలు తిప్పుకుంటున్నారే కానీ న్యాయం చేయడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ స్థలానికి సంబంధించి అబూబకర్, ఖాదర్‌బాషాలకు ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోయినప్పటికీ వారి పేర్ల మీద రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో ఎక్కించారన్నారు. ఆ స్థలం తప్ప మాకు ఏ ఆధారం లేదని, నేను కూడా ఆత్మహత్య చేసుకుంటే సమస్య పూర్తిగా లేకుండా పోతుందని బాధితుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో అక్కడే ఉన్న స్థానికులతో పాటు పోలీసులు అడ్డుకుని కాపాడారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 30 సంవత్సరాల నుంచి వన్‌బీ, అడంగల్, ఆర్ఎస్ఆర్‌లు తన తండ్రి సులేమాన్ పేరు మీద ఉన్నాయని, అయినా వేరే వారి పేరుతో ఎలా ఆన్‌లైన్ చేస్తారని ప్రశ్నించాడు. గతంలో రాయచోటిలో పనిచేసిన తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి ఆ స్థల సమస్యపై విచారణ చేసి 75 సెంట్ల స్థలం సులేమాన్‌దేనని ఎండార్స్‌మెంట్ కూడా ఇచ్చాడని తెలియజేశారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ విషయంపై కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌కు స్పందనలో అర్జీ ఇచ్చినా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కలెక్టర్‌కు ఇచ్చిన స్పందన అర్జీని ఆర్ఐ, వీఆర్వోలకు ఇచ్చినా పది రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిప్పు కుంటున్నారని వాపోయాడు. ఇక తనకు న్యాయం జరగదనే ఆవేదనతోనే ఆత్మహత్యాయత్నం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, జేసీ చొరవ తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితుడు వేడుకున్నాడు.

ఆంధ్ర ఊటీని.. లూటీ చేయాలని చూస్తే ఊరుకోం

- రెండెకరాల్లో ఏం స్టూడియో కడతారు
- కావాలంటే హిల్స్ కింద 7.5 ఎకరాలు లాంగ్ లీజుకు ఇస్తా
- చిత్తశుద్ధి ఉంటే అక్కడ స్టూడియో ఏర్పాటు చేయండి
- తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 14: ఆంధ్ర ఊటీగా పేరొందిన ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌ను లూటీ చేయాలని చూస్తే ఊరుకోమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరిపల్లె జయచంద్రారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యాత్ర-2 దర్శక, నిర్మాత మహేంద్రరెడ్డికి హార్సిలీహిల్స్‌లో భూకేటాయింపులు చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయంతో హార్సిలీహిల్స్ ఆత్మ క్షోభిస్తోందన్నారు. యువత కోసం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు క్రీడా ప్రాంగణానికి భూమిని కేటాయించి నిధులు విడుదల చేస్తే ప్రస్తుత జగన్ ప్రభుత్వం మాత్రం ప్రజల ఆస్తికి ఎసరుపెట్టే విధంగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రెండు ఎకరాల్లో ఏ స్టూడియో కడతారని ప్రశ్నించారు. యాత్ర-2 డైరెక్టర్‌కు అంతగా ఈ ప్రాంతపై ప్రేమ ఉండి స్టూడియో కట్టాలని ఉంటే హార్సిలీహిల్స్ కింద ఉన్న 7.50 ఎకరాల తన సొంత భూమిని లాంగ్ లీజుకు ఇస్తానన్నారు. యాత్ర-2 డైరెక్టర్‌కు చిత్తశుద్ధి ఉంటే తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న భూసంతర్పణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


ఇస్మాయెల్ మృతదేహం

సాగర్‌నగర్ (విశాఖపట్నం), ఫిబ్రవరి 14: అనారోగ్య కారణాలతో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కడప జిల్లా బద్వేల్‌కు చెందిన గోనుగుంట ఇస్మాయెల్ (19) విశాఖపట్నం సమీపంలోని గీతం విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం బీటెక్ (సీఎస్‌ఈ) చదువుతున్నాడు. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ హాస్టల్‌లో ఉంటున్న అతడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం ఎంతసేపటికీ తన గది తలుపులు తెరవకపోవడంతో సహచరులు సిబ్బందికి తెలియజేశారు. వారు వచ్చేసరికి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో హుటాహుటిన గీతం ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఇస్మాయెల్ తల్లిదండ్రులు హాజరత్, భూమిరెడ్డి వెంకటేష్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం రాలేదనే మనస్థాపంతో ఆత్మహత్య

సికెదిన్నె, ఫిబ్రవరి 14: ఉద్యోగం రాలేదని మనస్థాపానికి గురై దేవేందర్‌రెడ్డి (22) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. వేముల మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన దేవేందర్‌రెడ్డి బంధువులు ఇంటికని చింతకొమ్మదిన్నె మండలం మూలవంక గ్రామానికి వచ్చాడు. చదువుకున్నా ఎటువంటి ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపానికి గురై సోమవారం విషద్రావణం తాగాడు. వెంటనే వారి బంధువు విజయకుమార్ రిమ్స్‌లో చేర్పించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ బుధవారం మరణించాడన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మృతదేహం గుర్తింపు

సికెదిన్నె, ఫిబ్రవరి 14: చింతకొమ్మదిన్నె మండలం లింగారెడ్డిపల్లె సమీపంలో చెరువు సమీపంలో పది రోజుల క్రితం మరణించిన శవాన్ని గుర్తించినట్లు సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. శవం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అతడి సెల్‌ఫోన్ ఆధారంగా అతను సిద్దవటం మండలం జంగాలపల్లె యానాదికాలనీకి రాజా (35)గా గుర్తించారు. సెల్‌ఫోన్ ఆధారంగా అతడి బంధువులకు ఫోన్ చేయగా వారు వచ్చి గుర్తుపట్టారని తెలిపారు. పది రోజుల కిందట ఇంటి నుంచి వచ్చాడని, ఇంతవరకు తిరిగి రాలేదని భార్య తెలిపిందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హత్య కేసులో ఐదుగురికి రిమాండు


నిందితుల వివరాలు తెలియచేస్తున్న ఎస్ఐ విద్యాసాగర్

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 14 : బ్రహ్మంగారిమఠం మండలంలోని దిగువనేలటూరు పంచాయతీ మలుగుడుపాడు గ్రామానికి చెందిన కుంచాల రామ్మోహన్‌రెడ్డిని హత్య చేసిన సంఘటనలో ఐదుగురిని అరెస్టు చేసినట్లు బిమఠం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కుంచాల రామ్మోహన్‌రెడ్డి హత్య సంఘటనపై ఎ1 నిందితుడు అయిన కుంచాల వెంకటరెడ్డి బొగ్గుల బట్టీ వద్ద ఉన్న కుంచాల గురివిరెడ్డి, షేక్‌ఖాదర్‌వలి, మేరుగ తరుణ్, తమ్మిశెట్టి సుబ్బరాయుడు అనే ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిని మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథరెడ్డి ఆధ్వర్యంలో బద్వేలు కోర్టుకు రిమాండుకు తరలించినట్లు బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.మఠం పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత మనసుతో వాహనాలు నడపాలి

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో లోక్ అదాలత్ జడ్జి స్వర్ణప్రసాద్




సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి స్వర్ణప్రసాద్, ప్రమాదరహిత డ్రైవర్‌ను సత్కరిస్తున్న అధికారులు

కడప (మారుతీనగర్) ఫిబ్రవరి 14: వాహనాలు నడిపే సమయంలో మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని లోక్ అదాలత్ జడ్జి స్వర్ణప్రసాద్ డ్రైవర్లకు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్ఎం గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జడ్జి స్వర్ణప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కోసారి ఎదుటి వాహనదారుడి అజాగ్రత్తతో కూడా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తుంటారని, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ప్రతి డ్రైవర్‌పై ఉందన్నారు. ప్రయాణికులతో సఖ్యతగా మెలగి వారి విశ్వాసాన్ని చూరగొనేలా ప్రతీ డ్రైవర్, కండక్టర్, విధులు నిర్వహించి సంస్థ పురోగతికి దోహదపడాలన్నారు. డ్రైవర్ బాధ్యతగా విధులు నిర్వహించగలిగితేనే వారి కుటుంబంతో పాటు సంస్థ కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. చెడు వ్యసనాలకు బానిసైతే సంస్థతో పాటు, కుటుంబం కూడా నష్టపోవాల్సి ఉంటుందన్నారు. కొంతమంది హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలపై అత్యధిక వేగంతో ఎదురుగా వస్తుంటారని, అలాంటి సమయంలో కాసింత ఓర్పు, సంయమనంతో బస్సు స్పీడ్‌ను తగ్గించి, జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. అనంతరం ప్రమాదరహిత డ్రైవర్లను సత్కరించి నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ సుధాకర్, ఆర్టీసీ అధికారులు కె.హరి, గోవర్ధన్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఆర్టీసీ అసోసియేషన్ నాయకులు ఫక్రుద్దీన్, ఎ.ఆర్.మూర్తితో పాటు పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

30 మద్యం సీసాల స్వాధీనం



వల్లూరు, ఫిబ్రవరి 14 : అక్రమంగా మద్యం అమ్ముతున్నారని విషయం తెలియడంతో దాడి చేసి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రేపు సబ్ జూనియర్స్ జిల్లా స్థాయి బాల, బాలికల కబడ్డీ క్రీడా ఎంపికలు

కడప (స్పోర్ట్స్) ఫిబ్రవరి 14: ఉమ్మడి కడప జిల్లా సబ్ జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ క్రీడా ఎంపికల ప్రక్రియ ఈనెల 16వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక డీఎస్ఏ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్య, వర్కింగ్ సెక్రటరీ టి.శ్రీవాణి, జాయింట్ సెక్రటరీ ఆర్.సునీల్ తెలిపారు. కాగా 53 కేజీ విభాగంలో ఔత్సాహిక క్రీడాకారులు ఆధార్ కార్డు (ఒరిజినల్)తో హాజరు కావాలన్నారు. అభ్యర్థులు మార్చి 19వ తేదీ 2008 లోపు జన్మించి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 6304309294 అనే నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

జనసేన రాయలసీమ ఎన్నికల కోకన్వీనరుగా శివప్రసాద్



కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 14 : జనసేన పార్టీ రాయలసీమ ఎన్నికల కో-కన్వీనరుగా చంగారి శివప్రసాద్‌ను నియమిస్తూ ఆ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీ గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. అవకాశమిచ్చిన తమ అధినేత పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సొంతూరిలోనూ.. సీఎంపై నమ్మకం లేదా..?

- పులివెందులలోనూ అడుగడుగునా 'మా నమ్మకం నువ్వే జగన్' బోర్డులు
- ప్రజాధనం వృథా అంటున్న ప్రజలు



పులివెందులలోని సత్రం పాఠశాలకు సంబంధించిన బ్రిడ్జికి ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ బోర్డులు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 14: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తర నియోజకవర్గ కేంద్రమైన పులివెందులలోనూ సొంత డబ్బా మానలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో పాటు మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సొంతడబ్బా కొట్టుకునే వ్యవహారం పులివెందులకూ పాకింది. ఇక్కడున్న ప్రతి దుకాణం వద్దా బోర్డులు ఏర్పాటు చేశారు. దీనితో ప్రజాధనం వృథా అవుతోందని ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా..

పులివెందుల పట్టణంలో బోలేవార్డు అంటూ పాతబస్టాండ్ నుంచి సత్రం పాఠశాల వరకు సుందరీకరణ పనులు చేపట్టారు. ఈ పనులలో భాగంగా దుకాణాలకు రంగులు వేయడంతో పాటు దుకాణాల పేర్లతో బోర్డులు కూడా తామే ఏర్పాటు చేస్తామంటూ మున్సిపల్ అధికారులు తెలియజేశారు. దీనికి దుకాణదారులు సరే అన్నారు. తీరా బోర్డులు వచ్చాక వీటిని చూసిన దుకాణదారులు అవాక్కయ్యారు. ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఏర్పాటుచేసి అందులో మా నమ్మకం నువ్వే జగన్ అంటూ పెద్ద పెద్ద అక్షరాలు రాసి కింద చిన్న అక్షరాలతో దుకాణం పేరు ఏర్పాటుచేశారు. కొందరు మొహమాటంగా వీటిని దుకాణానికి పెట్టుకున్నా కొందరు పాత బోర్డుపైన దీనిని ఏర్పాటుచేసుకున్నారు.

ఇదిలా ఉండగా బోలేవార్డులో మాత్రమే ఏర్పాటు చేయాల్సిన 'మానమ్మకం నువ్వే జగన్' బోర్డులు పట్టణం మొత్తం ఏర్పాటుచేయడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. సొంత ఊరిలో కూడా ఇంత ప్రచారం అవసరమా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇది కేవలం స్థానిక ప్రజాప్రతినిధుల అతిభక్తి మాత్రమే అంటూ విమర్శిస్తున్నారు. ఇంతగా బోర్డులు ఏర్పాటు చేశారంటే.. సొంతూరి ప్రజలు కూడా తనను నమ్మడం లేదని సీఎం నమ్ముతున్నారేమో అని పలువురు పేర్కొంటున్నారు. అభివృద్ధి చేశామని నమ్మకం ఉంటే సొంతూరిలో కూడా ఇంతలా బోర్డులు బలవంతంగా ఏర్పాటు చేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.


పులివెందుల పట్టణం ముద్దనూరు రోడ్డులోని గాంధీ సర్కిల్ వద్ద ఉన్న దుకాణాలకు ఏర్పాటు చేసిన బోర్డులు


బోలే వార్డులో ఏర్పాటు చేసిన బోర్డులు

సమ్మె జయప్రదం చేయాలంటూ స్కూటరు ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 14 : కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన గ్రామీణ భారత్ సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ కడప నగరంలో బుధవారం స్కూటరు ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సంధ్య సర్కిల్, కోటిరెడ్డి, జియాన్ కాలేజీ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్, ఏడురోడ్లు, పొట్టిశ్రీరాములు, రాయల్ థియేటరు మీదుగా పాతబస్టాండు వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి మాట్లాడారు. రైతులు పంటలకు గిట్టుబాటు ధర చట్టాన్ని చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కౌలు రైతులకు పంట రుణాలు, పంట నష్టం, ఇన్సూరెన్స్ సౌకర్యం భూయజమానితో సంబంధం లేకుండా కల్పించాలని, ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజువారీ వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న గ్రామీణ బంద్, ట్రాన్స్‌పోర్టు సమ్మె, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర ప్రధాన కార్యదర్శి ఉద్ది మద్దిలేటి, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, వ్యవసాయకార్మిక సంఘం, మున్సిపల్, డీహెచ్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోధనలో సాంకేతికత ఉపయోగించండి



మాట్లాడుతున్న ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 14 : బోధనలో సాంకేతికతను ఉపయోగించాలని ఉపవిద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్ సభా భవనంలో విజన్ 2025 ఇంక్లూజివ్ ఆంధ్ర డిజిటల్ పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ విద్యను బోధనలో ఉపయోగించడం ద్వారా సాధారణ విద్యార్థులతో పాటు దివ్యాంగులకు ఎనలేని ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేసుకుని విద్యార్థులకు అందించాలన్నారు. సహిత విద్య ఉపాధ్యాయులు ట్యాబ్‌లు ఉపయోగించుకుని విద్యార్థుల కు మెరుగైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర సహాయ సహిత విద్య సమన్వయకర్త మల్లికార్జున, రిసోర్స్‌పర్సన్ సునీల్‌కుమార్, మహాలక్ష్మినాయుడు దివ్యాంగులకు ఉద్దేశించిన వివిధ యాప్‌లను ఉపాధ్యాయులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య జిల్లా సమన్వయకర్త మిట్టకేశవరెడ్డి, అకడమిక్ మానిటరింగ్ అధికారి ధనలక్ష్మి, రమణ మూర్తి, భవిత రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

రాచమల్లుకు వ్యతిరేకంగా.. అసమ్మతి నేతల ప్రచారం


13వ వార్డులో ఎమ్మెల్యే రాచమల్లు వద్దంటూ ప్రచారం చేస్తున్న వైసీపీ అసమ్మతి నేతలు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 14: ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లు ప్రజావ్యతిరేకిగా మారాడని, రాష్ట్రంలో ఎక్కడాలేని అవినీతి పరుడుగా పేరుగాంచాడని ఆయనను ప్రజలు తిరిగి ఎన్నుకోవద్దంటూ వైసీపీ అసమ్మతినేతలు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి నేతృత్వంలో ప్రచారం చేపట్టారు. బుధవారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని శివచంద్రారెడ్డి ఆయిల్ మిల్లునుంచి మైదుకూరు రోడ్డు వరకు భారీ బైక్‌ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో వందలాదిమంది వైసీపీ కార్యకర్తలు రాచమల్లు వద్దు-జగన్ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి అధిష్టానం టికెట్టు అధికారికంగా ప్రకటించకపోయినా ఆయన ప్రచారం చేసుకుంటున్నాడన్నారు. ప్రొద్దుటూరులో రాచమల్లుకు తప్ప మర్వెరికైనా టిక్కెట్టు ఇవ్వాలంటూ తాము ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేస్తున్నామన్నారు. అనంతరం వీరంతా శ్రీరాముల పేటలోని ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ ఇంటి వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి 13 వవార్డులో రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి వ్యతిరేకంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. వైసీపీ అసమ్మతి నేతల ప్రచారంలో శివచంద్రారెడ్డితో పాటు వైసీపీ కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, ఇర్ఫాన్ బాషా, మునీర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వెల్లాల భాస్కర్, పొట్టు లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా.. గురువారం నుంచి ఎమ్మెల్యే రాచమల్లు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో వైసీపీ అసమ్మతి నేతలు ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేపడుతుండడంతో వైసీపీ వర్గాల్లో కలవరం మొదలైంది. ఇది ఉదిక్తలకు ఎక్కడ దారితీస్తుందో అని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కన్నుల పండువగా మల్లేశ్వరస్వామి కల్యాణం



దుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు, కల్యాణానికి హాజరైన భక్తులు

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 14 : పట్టణంలోని పోలీసుస్టేషన్ సబ్‌జైలు ఆవరణంలో ఉన్న కనకదుర్గ ఆలయంలో దుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామి కల్యాణం వేద పండితులు ప్రదీప్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామి నూతన బ్రహ్మసూత్ర శివలింగం ప్రతిష్ఠను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కల్యాణాన్ని పచ్చని తోరణాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల సాక్షిగా కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం చేసి ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు అందించారు.

కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకోండి


కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనరు క్రిష్ణ

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 14 : కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం పథకంను మున్సిపాలిటీలో ఉన్న మురుగు, సెప్టిక్ ట్యాంకు శుభ్రపరిచే కార్మికులు తమ పేర్లను వెంటనే నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనరు ఎం.క్రిష్ణ కోరారు. బుధవారం మున్సిపాలిటీలో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా కేంద్రం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. మల, మురుగు శుభ్రం చేసే కార్మికులు, సెప్టిక్ ట్యాంకు డ్రైవర్లు, హెల్పర్లతో పాటు నేటి నుంచి నమస్తే కార్యక్రమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా నిమగ్నమైనవారు కూడా ఈ పథకంలో నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టరు లక్ష్మీనారాయణ, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

తవ్వా వెంకటయ్యకు సన్మానం


తవ్వా వెంకటయ్యను సన్మానిస్తున్న దృశ్యం

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 14 : అధికార భాషా సంఘం సభ్యుడుగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా డాక్టర్ తవ్వా వెంకటయ్యకు బుధవారం స్థానిక లలితా కళానికేతన్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. లలిత కళానికేతన్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు వైవీయూ పాలకమండలి సభ్యుడు ప్రొఫెసర్ మూలమల్లికార్జున తల్లి ఓబులమ్మ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు. మూల పెద్దమునిరెడ్డి, మూల ఈశ్వర్‌రెడ్డి మూల చిన్న అయ్యవారురెడ్డి, శివారెడ్డి, స్వామిరెడ్డి, బాలసుబ్బారెడ్డి , డాక్టర్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

చిట్వేలి తహశీల్దారుగా జ్ఞానేశ్వరి

చిట్వేలి, ఫిబ్రవరి 14: చిట్వేలి తహశీల్దారుగా జ్ఞానేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఇన్‌చార్జి తహశీల్దారు సుమని ఆమెకు బాధ్యతలు అప్పగించారు. రాజంపేట ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న ఈమె బదిలీపై చిట్వేలికి వచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు

మండలంలోని మైలపల్లి, దేవమాచుపల్లి, చిట్వేలి, తిమ్మాయగారిపల్లె పోలింగ్ కేంద్రాలను బుధవారం తహశీల్దారు జ్ఞానేశ్వరి పరిశీలించారు. అలాగే స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాల్లో పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. దొంగ ఓటర్లు పట్ల అప్రమత్తంగా ఉండాలని బీఎల్‌వోలను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రోడ్డు ఛిద్రం.. జర భద్రం



రాయచోటి- రాజంపేట ప్రధాన రహదారిలోని సానిపాయి వద్ద గుంతలమయమైన రోడ్డు, నిధులు రాకపోవడంతో ఆగిన వీరబల్లి-సుగాలి తాండా రోడ్డు

● వాహనదారులకు తప్పని తిప్పలు

వీరబల్లి, ఫిబ్రవరి 14: గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లన్నీ ఛిద్రమై వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. గత ఐదు సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోక గుంతలమయమై అసౌకర్యంగా మారాయి. గతంలో కురిసిన అరకొర వర్షాల కారణంగా వాహనాల రాకపోకలు అధికం కావడంతో రోడ్ల పరిస్థితి దారుణంగా మారింది. మండలంలోని కొన్ని రహదారులు ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధించి ఉంటే మరికొన్ని రహదారులు పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఉన్నాయి. కానీ రోడ్ల పరిస్థితి ఇటు ఆర్‌అండ్‌బీ గానీ పంచాయతీ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో వాహనదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జిల్లా కేంద్రానికి 17 కి.మీ. దూరం ఉన్న మండలాన్ని ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు అంటున్నారు. భౌగోళికంగా మండలాన్ని తీసుకుంటే చుట్టూ 50 కి.మీ. మేర విస్తీర్ణం ఉంటుందని అంచనా. మండల కేంద్రం నుంచి సానిపాయి, గడికోట, వంగిమళ్ల, గుర్రప్పగారిపల్లె, ఓదివీడు గ్రామాల నుంచి పలు సమస్యలపై మండల కేంద్రానికి రావాలంటే ఆయా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. మండల కేంద్రం నుంచి ఏ గ్రామానికి వెళ్లినా 10-15 కి.మీ. దూరం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంత రోడ్లు బాగుపడితే తప్ప తమ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. ఏ మార్గం వెళ్లినా అడుగు లోతు గుంతలు తప్ప మరేమీ కనిపించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయించడంతో పాటు నూతన రోడ్ల నిర్మాణం చేపడితే వాహనదారులతో పాటు ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

20 ఏళ్లుగా రోడ్డు వసతి లేదు

- రమణ, బొంగావాండ్లపల్లె



మా ఊరికి 20 సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం లేదు. ద్విచక్ర వాహనాలు తప్ప నాలుగు చక్రాల వాహనాలు రావాలంటే అతి కష్టంగా రావాల్సిందే. ఎక్కడ చూసినా రోడ్డంతా గుంతలమయమై ఉంటుంది. ఇటీవల రోడ్డు శాంక్షన్ అయిందని రోడ్డు మరమ్మతులు చేపట్టి కంకర తోలారు. తీరా చూస్తే బిల్లులు రాలేదని పనులు నిలిపేశారు.

రోడ్లన్నీ గుంతలమయం

- సురేంద్రరెడ్డి, వీఆర్డీఎస్ చైర్మన్



మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతల మయమయ్యాయి. ఏ గ్రామానికి వాహనాలు వెళ్లాలన్నా వాహనదారులకు ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అభివృద్ధి శూన్యం. గ్రామాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి.

వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో

గాలివీడు, ఫిబ్రవరి 14: వసంత పంచమిని పురస్కరించుకొని మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వసంత పంచమి వేడుకల్లో పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య తల్లిదండ్రులు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎంఈవో నాగరాజు మాట్లాడుతూ జ్ఞానం, వాక్కు, విద్య మొదలైన శక్తులే సరస్వతీమాత అన్నారు. దేశ సంస్కృతి, సాంప్రదాయాలను విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భావితరాలకు బంగారుబాటలు వేయాలన్న ధ్యేయంతో అందుకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం తల్లిదండ్రులు, చిన్నారులను తీసుకువచ్చి అక్షరాభ్యాసం చేయించారు.

మోదీ విధానాలతో పొంచివున్న ప్రమాదం

● గోడపత్రాలను విడుదల చేసిన కార్మిక సంఘ నేతలు

రాజంపేట, ఫిబ్రవరి 14: కేంద్ర, కార్మిక, రైతు వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు బుధవారం గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాల ద్వారా రైతుల పాలిట ఉరితాళ్లుగా మారుతున్నాయని, ప్రభుత్వ సంస్థలు సైతం కార్పొరేట్ చేతుల్లోకి వెళుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల్లో మూడు లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వీటికి మోడీ తీసుకొచ్చిన 4 లేబర్ విధానాలే కారణమన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.రాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, నేతలు సికిందర్, నరసింహులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన దృశ్యం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 14: పంచాయతీ పరిధిలోని కొత్తకోడూరులో ఇటీవలే నూతనంగా జగద్గురు ఆదిశంకరాచార్యుల మఠాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం వేదపండితులచే బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఉదయాన్నే హోమాలు, ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను చేశారు. ఆలయంలో వివిధ రకాల పూజలు చేశారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాలకు చెందిన బ్రాహ్మణులు, చుట్టుపక్కల ప్రజలు కార్యక్రమానికి తరలివచ్చారు. అంతేకాకుండా ఆలయ ఆవరణలో ఐదుముఖాల అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు నరసింహశర్మ తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటరమణకు కవిశిఖామణి బిరుదు



రాజంపేటటౌన్, ఫిబ్రవరి 14: పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, కవి గంగనపల్లి వెంకటరమణకు కవి శిఖామణి బిరుదు ఆహ్వానం అందినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌కు చెందిన మహతి సాహితీ కవి సంఘం అధ్యక్షుడు డాక్టర్ అడిగొప్పల సదయ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో జరిగిన వంద కవితల పండుగ కార్యక్రమంలో తాను పాల్గొని వంద పద్యాల కవితలను రచించినట్లు తెలిపారు. అందులో తనను ఎంపిక చేశారని, ఈ నెల 18న హైదరాబాదు నగరంలోని రవీంద్ర భారతిలో కవి శిఖామణి బిరుదు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుక


సరస్వతిమాతకు పూజలు చేస్తున్న దృశ్యం

సంబేపల్లె, ఫిబ్రవరి 14: వసంత పంచమి పురస్కరించుకొని సంబేపల్లె ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు నాగేశ్వర్‌నాయక్, జయమ్మలు సరస్వతిమాత చిత్రపటాన్ని అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకల విద్యా స్వరూపిణి, సకల వాఙ్మయానికి మూలకారకురాలు సరస్వతిమాత అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి వెంకటసాయి రోహిత్


సాయిరోహిత్‌ను అభినందిస్తున్న దృశ్యం

రాజంపేట, ఫిబ్రవరి 14: పట్టణంలోని శ్రీసాయి విద్యాలయానికి చెందిన 10వ తరగతి విద్యార్థి మనుబోలు వెంకటసాయి రోహిత్ ఇన్‌స్పైర్ మనక్ రాష్ట్రస్థాయి నుంచి ఉత్తమ సైన్స్‌ఫెయిర్ ప్రాజెక్టుగా ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంటు డాక్టర్ ఎస్.బాలరాజు, ప్రిన్సిపల్ పి.వి.రేణుకాదేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రాయచోటి వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో భాగంగా 30 జిల్లాల నుంచి 245 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారని, వాటిలో ఉత్తమ ప్రాజెక్టుల ఎంపికను ఢిల్లీలోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి వచ్చిన ప్రతినిధులు ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటు ప్రాధాన్యతపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దీప్తి

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 14: రాష్ట్రంలోని ప్రతి యువత మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ అని ముక్తకంఠంతో చెబుతున్నారని టీడీపీ మహిళ నాయకురాలు దుద్యాల అనితా దీప్తి తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే యువత ప్రాత కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, టీడీపీ నాయకులు దరూరి రవి, ఏసోబు నాయుడు, ధన యాదవ్, రామయ్య, నగిరిపాటి సంతోష్, గంపాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 18 నుంచి షటిల్ టోర్నమెంట్

సుండుపల్లె, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 18 నుంచి సుండుపల్లె, వీరబల్లి, కేవీపల్లె మండల స్థాయి షెడ్యూల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హరికుమార్, ఇర్ఫార్ పఠాన్‌లు తెలిపారు. ఓపెన్ టోర్నమెంట్ అండర్-19 రెండు విభాగాల్లో టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 944148577, 8247830940 నెంబర్లకు ఫోన్ చేసి టీం పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ నెల 17వ తేది సాయంత్రం లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓపెన్ టోర్నమెంట్ విభాగంలో మొదటి నాలుగు స్థానాల్లో విజయం సాధించి ప్రతిభ చూపిన టీములకు ప్రోత్సాహక బహుమతులు, అండర్-19 విభాగంలో మూడు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు


భోగాంజనేయస్వామి

నందలూరు, ఫిబ్రవరి 14: మండలంలోని కుంపినీపురంలో వెలసిన భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 16-18 వరకు అత్యంత ఘనంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాన్ని అత్యంత సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం స్వామికి అభిషేకం, తదుపరి గరుడ సేవ, ప్రసాద వినియోగం, రాత్రికి ఆర్కెస్ట్రా, శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, రాత్రికి రేలారే రేలా, ఆదివారం ఉదయం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు పేర్కొన్నారు.



వైసీపీ గెలుపు అసాధ్యం: రేవతి


పిట్లావాండ్లపల్లెలో ప్రచారం చేస్తున్న రేవతి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 14: టీడీపీ, జనసేన కలయికతో వైసీపీ గెలుపు అసాధ్యమని టీడీపీ నియోజకవర్గ మహిళా నాయకురాలు నగిరిపాటి రేవతి తెలిపారు. బుధవారం మండలంలోని పిట్లావాండ్లపల్లె గ్రామంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన కలయికతో వైసీపీకి ఓటమి గోడ కడతామన్నారు. దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీలు, అగ్రవర్ణాలు తదితరులు చంద్రబాబును సీఎంను చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా టీడీపీ, జనసేన గెలుపును ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఎస్సీ ఉపాధ్యక్షుడు తేనేపల్లి చిన్నా, మాజీ సర్పంచ్ కె.లక్ష్మీనారాయణ, నాయకులు ఎ.సుబ్రహ్మణ్యం, రత్నయ్య, మహేష్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి ఇంటి స్థలం : తహసీల్దారు


మందపల్లి ప్రజలతో మాట్లాడుతున్న తహశీల్దారు

సిద్దవటం, ఫిబ్రవరి 14: అర్హత గల ప్రతి పేదవాడికి ఇంటి స్థలం మంజూరు చేస్తామని సిద్దవటం తహసీల్దారు మురాషాద్‌వలి పేర్కొన్నారు. మండలంలోని మందపల్లి, రామస్వామిపల్లె గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఏవైనా సమస్యలుంటే తనకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అనురాధ, వీఆర్వో నాని, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, పెన్షనర్లు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 14: ఉద్యోగులు, పెన్షనర్ల, న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లక్కిరెడ్డిపల్లె తాలూకా ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు బలరామరాజు పేర్కొన్నారు. రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ పిలుపు మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్నం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బలరామరాజు మాట్లాడుతూ ఉద్యోగుల, పెన్షనర్ల డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, రెడ్డెయ్య, సాహెబ్‌పీర్, రహీం, వెంకటేసు, సమ్మత్‌ఖాన్, పెన్షనర్లు ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 14: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ ఎన్టీఆర్ అని పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ టీడీపీ నాయకుడు ద్వారకనాథరెడ్డి, మండిపల్లె రాంప్రసాదు రెడ్డిలు తెలిపారు. బి.యర్రగుడి పంచాయతీలోని నాగిరెడ్డిపల్లెలో నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1983 సంవత్సరం నుంచి ఏపీలో పేదల అభ్యున్నతి కోసం టీడీపీని ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల వారికి ఆశాజ్యోతిగా నిలిపిన గొప్పమహనీయుడు అన్నారు. కార్యక్రమంలో రాజంపేట తెలుగుయువత నవీన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామ్‌ప్రసాదురెడ్డి, మహిళలు పాల్గొన్నారు.


నూతన ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

● ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్తులు


నూతనంగా నిర్మించిన రామాలయం

సుండుపల్లె, ఫిబ్రవరి 14: మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీ ఎగువ జంగంపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో ఈ ఆలయం నిర్మించామన్నారు. ధ్వజస్తంభాన్ని అదే గ్రామ పంచాయతీకి చెందిన కృష్ణమోహన్‌రెడ్డి అందజేసినట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఆలయ అభివృద్ధికి ఎంపీటీసీ రెడ్డెమ్మ రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాయవరం ఎంపీటీసీ రెడ్డెమ్మ, జంగం సంఘం అధ్యక్షుడు శివబాలయ్య, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా కుమారస్వామి బాధ్యతలు



లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 14: లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్‌గా కుమార్‌స్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు జిల్లాలో అస్పర్ మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఉదయశంకర్ రాజు అనంతపురం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలుంటే వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం టీడీ రెడ్డెయ్య, సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

రూ.1.19 కోట్లతో రహదారి పనులు

సంబేపల్లె, ఫిబ్రవరి 14: మండలంలోని గుట్టపల్లెలో రూ.1.19 కోట్ల ఏఐఐడీ నిధులతో గుట్టపల్లె రామకృష్ణారెడ్డి నగర్ నుంచి వీరాంజనేయ దేవస్థానం వరకు నిర్మించిన రహదారిని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ మహిమ గల గుట్టపల్లె వీరాంజనేయస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతుండడం హర్షణీయమన్నారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్స్ బోర్డు మెంబర్ నిర్మల, వైస్ ఎంపీపీ రవీంద్రనాయుడు, సర్పంచ్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, చిదంబర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్రమణనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

● థామస్‌కు చంద్రబాబు దిశా నిర్దేశం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 14: 'ఏ సమయంలోనైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి. రా.. కదలిరా విజయవంతమైంది. ఇదే స్ఫూర్తితో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు ముందుకెళ్లాలి' అని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ వీఎం థామస్‌కు చంద్రబాబు హితబోధ చేశారు. జీడీనెల్లూరులో పార్టీ స్థితిగతులు, రా.. కదలిరా సక్సెస్, జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వ్యూహరచన తదితర అంశాలపై పార్టీ కేంద్ర కార్యాలయంలో సుమారు గంట పాటు చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలి, పార్టీ బలోపేతానికి ఇంకా పటిష్ఠంగా చేపట్టాల్సిన వ్యూహాలు తదితర అంశాలను చంద్రబాబు ప్రస్తావించారు. ఐవీఆర్ఎస్ సర్వే ఫలితాలపై డాక్టర్ థామస్‌కు సానుకూలంగా ఉందన్న విషయం కూడా చర్చకు వచ్చింది. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. జీడీనెల్లూరు రాజకీయ పరిస్థితులపై చంద్రబాబు గంటపాటు సమీక్ష జరిపారని థామస్ తెలిపారు. రా.. కదలిరా విజయవంతమైనందుకు అభినందించారని, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారని చెప్పారు.

విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలను రేకెత్తించాలి

● జిల్లాస్థాయి 'ఇన్‌స్పైర్ మనక్' సమావేశంలో కలెక్టరు



మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

యాదమరి, ఫిబ్రవరి 14: విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రపరంగా వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడం చాలా అవసరమని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. యాదమరి మండలం మోర్దానపల్లె వద్ద ఉన్న పీఈఎస్ పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డు ప్రాజెక్టు కాంపిటీషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమం 16వ తేది వరకు జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకత, వినూత్న ఆలోచనలను అభివృద్ధి పరచడానికి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ పథకం లక్ష్యమన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకకు కార్యరూపందాల్చుతూ వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రదర్శించేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో దేవరాజులు, ఎస్ఎస్‌ఏ ఏపీసీ వెంకటరమణారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ విజయేందర్‌రావు, డీవైఈవో చంద్రశేఖర్, జిల్లా సైన్స్ అధికారి రమణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిత్తూరులో టీడీపీ ఆశావహుల అభిప్రాయ సేకరణ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 14: చిత్తూరు అసెంబ్లీకి టీడీపీ నుంచి టిక్కెట్ ఆశిస్తున్న వారితో ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మునిరామయ్య బుధవారం మాట్లాడారు. విడి విడిగా వారితో సమావేశమై అభిప్రాయ సేకరణ జరిపారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో యన వారి అభిప్రాయాలు సేకరించారు. గురజాల జగన్మోహన్, కటారి హేమలత, కాజూరు బాలాజి, సీఆర్ రాజన్‌తో మాట్లాడారు. వారి అభిప్రాయాలు తీసుకున్నారు. కాగా చంద్రప్రకాష్, తేజస్విని అందుబాటులో లేకపోవడంతో గురువారం వారితో మాట్లాడే అవకాశం ఉంది.

అడవిలో తీవ్రగాయంతో దూడ మృతి

● చిరుతే దాడి చేసి చంపిందన్న గ్రామస్తులు

● పేలుడు పదార్థం తిని చనిపోయిందని నిర్ధారించిన అటవీ అధికారులు



మృతి చెందిన దూడ

రామకుప్పం, ఫిబ్రవరి 14: రామకుప్పం మండలం 89పెద్దూరు అటవీప్రాంతం ఉప్పువంక ప్రాంతంలో మంగళవారం సాయంత్రం రవి అనే వ్యక్తికి చెందిన దూడ తీవ్రగాయంతో మృతి చెందింది. మంగళవారం రవికి చెందిన రెండు ఆవులతోపాటు దూడ మేత కోసం ఉప్పువంక అటవీప్రాంతానికి వెళ్లాయి. సాయంత్రం రెండు ఆవులు మాత్రం తిరిగొచ్చాయి, దూడ మాత్రం రాలేదు. బుధవారం ఉదయం రవి స్థానికులతో కలసి గాలించగా అడవిలో తీవ్రగాయంతో మృతిచెందిన దూడను గుర్తించారు. చిరుత దాడిలోనే దూడ చనిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై కుప్పం అటవీ రేంజ్ అధికారి వైసీ రెడ్డిని వివరణ కోరగా దూడ ఏదైనా పేలుడు పదార్థం తిని చనిపోయి ఉంటుందన్నారు. దూడకు అయిన గాయాన్ని బట్టి తాము ఆ నిర్ధారణకు వచ్చామన్నారు. అటవిలో వన్యప్రాణుల వేట కోసం ఎవరైనా పేలుడు పదార్థం ఏర్పాటు చేసి ఉంటారని ఆయన తెలిపారు. ఆ దిశలో తాము విచారణ జరుపుతున్నామన్నారు.

ద్రావిడ వర్సిటీలో జీతాల కోసం ఉద్యోగుల నిరసన



ద్రావిడ వర్సిటీలో నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

గుడుపల్లె, ఫిబ్రవరి 14: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ జీతాల కోసం బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. జీతాలు రాక నెలలు గడుస్తున్నా ఎంతో ఓర్పుతో వర్సిటీలో విధులు నిర్వహించామని, అయినా అధికారులు తమకు ఇంత వరకు జీతాలు ఇవ్వలేదన్నారు. జీతాలు అందించే వరకు తాము పరిపాలనా భవనం ఎదుట నిరసన కొనసాగిస్తామని వారు స్పష్టంచేశారు.

కర్ణాటక మద్యం సీజ్: ఇద్దరి అరెస్ట్



నిందితులను మీడియాకు చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు, ఫిబ్రవరి 14: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తీసుకొస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వీరి కారుతో పాటు 2400 టెట్రా మద్యం ప్యాకెట్లను సీజ్ చేశారు. ఈ వివరాలను బుధవారం చిత్తూరులోని తాలూకా పోలీసుస్టేషన్ ఆవరణలో ఈస్ట్ సీఐ కుళ్లాయప్ప, తాలూకా ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డితో కలిసి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి మీడియాకు వివరించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం చిత్తూరు మండలం కన్నికాపురం రైల్వే బ్రిడ్జి సమీపంలో తనిఖీలు చేపట్టామన్నారు. పోలీసులు ఓ కారును ఆపి తనిఖీ చేయగా, వివిధ రకాల బ్రాండ్లకు చెందిన 2400 టెట్రా ప్యాకెట్ల మద్యం దొరికిందన్నారు. దీంతో కారులో ఉన్న జీడీ నెల్లూరు మండలం కాశెపల్లెకు చెందిన తోటి ముద్దుకృష్ణ, ఒగ్గువారిపల్లెకు చెందిన జానకిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మద్యంతో పాటు కారును సీజ్ చేశామని, వీటి విలువ రూ.15 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

టీపీకోటలో మూషిక జింక



నాగలాపురం, ఫిబ్రవరి 14 : నాగలాపురం మండల పరిధిలోని టీపీ కోట గ్రామంలో అరుదైన మూషిక జింక (మౌస్ డీర్) దర్శనమిచ్చింది. రెండు రోజులకు మునుపు గ్రామానికి చెందిన షారుక్ అటవీ ప్రాంత సమీపంలోని పొలాల వద్దకు వెళ్తుండగా మూషిక జింక కనిపించింది. కాసేపటి తరువాత అది అడవిలోకి వెళ్లిపోయింది. నల్లమలై అటవీ ప్రాంతాల్లో కన్పించే ఈ మూషిక జింక గతంలో దాసుకుప్పం అటవీ ప్రాంతంలో కనిపించినట్లు సత్యవేడు ఎఫ్ఆర్‌వో జయప్రసాద్ రావు తెలిపారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న గల్లా కుటుంబీకులు - ఆకట్టుకున్న విద్యార్థుల కళా ప్రదర్శన

పేటమిట్టలో కుంభాభిషేక మహోత్సవాలు

పూతలపట్టు, ఫిబ్రవరి 14: పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మూడో రోజైన బుధవారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గ్రామంతో పాటు ఆలయాల చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలంకరణ పలువురిని ఆకట్టుకుంటోంది. బుధవారం వేకువజామున గణపతి వేణుగోపాలస్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. బ్రహ్మముహూర్త సమయంలో మహాగణపతి స్వామివారి మూషిక వాహనం విగ్రహ స్థాపన జరిగింది. ఉదయం 8 గంటల నుంచి జరిగిన వేదస్వస్తి ప్రతిష్ఠమూర్తులకు శ్రీరామ సహస్రనామ హవనం, ఆంజనేయ సహస్ర హోమాలు, దర్బారు సేవ, చతుర్వేదస్వస్తి తదితర పూజా కార్యక్రమాల్లో గల్లా రామచంద్రనాయుడు, అరుణకుమారి, జయదేవ్ పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటలకు నిర్వహించిన పండరి భజనలు, కోలాటాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు యువరాజులు నాయుడు, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, నాయకులు చింతగుంపల రజినీ, బీసీ నాయకులు షణ్ముగం, గల్లా కుటుంబసభ్యులతో పాటు ట్రస్టు సభ్యులు గల్లా రామానాయుడు, భానుమూర్తి నాయుడు, స్థానికులు పాల్గొన్నారు. గురువారం ఉదయం 4 గంటల నుంచి విగ్రహప్రతిష్ఠ, అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవం జరగనున్నాయి.

శ్రీకాళహస్తిలో వైసీపీకి ఝలక్...!

● టీడీపీలో చేరిన ముగ్గురు జడ్పీటీసీలు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీటీసీలు, నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 14: అసమ్మతి నేతలు వైసీపీకి గట్టి షాక్ ఇచ్చారు. ముగ్గురు జడ్పీటీసీలతో పాటు ఓ మాజీ జడ్పీటీసీ అధికార పార్టీకి గుడ్‌బై చెప్పారు.శ్రీకాళహస్తి జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, తొట్టంబేడు జడ్పీటీసీ అర్చన దేవి, ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య, తొట్టంబేడు మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన వ్యాపారి హరి నాయుడు వైసీపీలో అసంతృప్తితో కొనసాగుతున్నారు. టీడీపీ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వారంతా బుధవారం సాయంత్రం మంగళగిరిలో ప్రత్యక్షమయ్యారు.టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఒక్కసారిగా నలుగురు కీలక నేతలు అధికార పార్టీని వీడడంతో టీడీపీలో కొత్త జోష్ నెలకొంది. ఏకగ్రీవంగా ఎన్నికైన నేతలు కూడా వెళ్లిపోవడంతో వైసీపీలో అంతర్మథనం మొదలైంది.త్వరలోనే పెద్దసంఖ్యలో ఎంపీటీసీలు, సర్పంచులు వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. కాగా శ్రీకాళహస్తి వైసీపీలో అసమ్మతి కలవరం మొదలైందని తొమ్మిది నెలల ముందే ఆంధ్రజ్యోతి చెప్పింది.గత ఏడాది మే 8వ తేది బొజ్జల నివాసంలో జరిగిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు బొజ్జల హరినాథ రెడ్డి తొలి వర్ధంతి నాడు పలువురు వైసీపీ కీలక నాయకులు బొజ్జల సోదరులకు ఘనంగా నివాళులర్పించారు.తరువాత బొజ్జల కుటుంబంతో చాలా సేపు భేటీ అయ్యారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో తమ పార్టీలో ఎలాంటి అసమ్మతి లేదని వైసీపీ చెప్పుకుంది. ఆ రోజు ఆంధ్రజ్యోతి ప్రస్తావించిన పేర్లలో ఇద్దరు తప్ప దాదాపు అందరూ బుధవారం టీడీపీలో చేరిపోవడం గమనార్హం.

కాణిపాక ఆలయానికి వేలాల ద్వారా రూ.84.45 లక్షల ఆదాయం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 14: కాణిపాక వినాయక స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలాలు, సీల్, ఆన్‌లైన్ టెండర్ల ద్వారా 84,45,400 ఆదాయం చేకూరినట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. ఆలయ కార్యాలయ భవనం వద్ద పలు టెండర్లు నిర్వహించారు. ఆలయం వద్ద సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరచుకునేందుకు రూ.47,00,400.. శివాలయం పరిసరాలు, పార్కువద్ద ఫొటోలు తీసే హక్కు కోసం రూ.18,05,000.. డార్మెటరీహాల్ వద్ద బంకు నిర్వహణకు రూ.4,10,000.. మూల విరాట్ పాలాభిషేకానికి పాల సరఫరాకు రూ.6,15,000.. బస్టాండు వద్ద బంకు నిర్వహణకు రూ. 9,15,000 చొప్పున హెచ్చుపాటదారులు హక్కులు పొందారు. వీరికి ఏడాది కాలపరిమితి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఏఈవోలు హరిమాధవరెడ్డి, రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఏసీ కార్యాలయ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు, టెండర్ దారులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు ప్రత్యేక బ్యాంకు అకౌంట్ తప్పనిసరి



రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 14: త్వరలో జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే ముందే ప్రత్యేక బ్యాంకు అకౌంట్, చెక్‌బుక్ కలిగివుండాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. ఎన్నికల్లో వీరు చేసే ఖర్చులకోసం ఇది తప్పనిసరన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. పోలింగ్ కేంద్రాల స్థానాలు, వాటి పేరుపై సవరణలు ఉంటే సంబంధిత ఈఆర్వోలకు ప్రతిపాదనలు అందజేయాలని సూచించారు. ప్రతి 1500 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, ఆ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన అధికారుల నియామకాలు జరిగాయన్నారు. సమావేశంలో పార్టీల ప్రతినిధులు ప్రభుతేజ (టీడీపీ), భాస్కర్, పరదేశి (కాంగ్రెస్), గంగరాజు (సీపీఎం), ఉదయ్‌కుమార్ (వైసీపీ), భాస్కర్ (బీఎస్పీ), ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఆస్థాన మండపంలో హోమం నిర్వహిస్తున్న అర్చక, పండితులు - సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న తల్లిదండ్రులు

కాణిపాకంలో సామూహిక అక్షరాభ్యాసం



ఐరాల(కాణిపాకం): ఫిబ్రవరి 14: వసంతపంచమి సందర్భంగా బుధవారం కాణిపాక క్షేత్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ప్రధాన ఆలయంలో స్వామికి అభిషేకం నిర్వహించి వరసిద్ధుడి ఉత్సవమూర్తి, సరస్వతి విగ్రహాన్ని ఛైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు,ఆలయ అధికారులు, సిబ్బంది ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. వేద పండితుల మంత్ర ఘోష నడుమ వినాయక స్వామి, సరస్వతీదేవి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. పలకలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థుల చేత పలక, బలపం పట్టించి ఓనమాలు దిద్దించారు. జిల్లాలో ప్రతి విద్యార్థి చక్కగా చదివి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని అందరూ ఆకాంక్షించారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాక వినాయక స్వామి ఆలయం బుధవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వసంత పంచమి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామి దర్శనానికి సుమారుమూడు గంటల సమయం పట్టింది.



గాయపడిన మనోహర రెడ్డి - ఏనుగు దాడిలో ధ్వంసమైన మంచం - వరి పంటను తొక్కుకొంటూ వచ్చిన ఏనుగు - కాకర్లవారిపల్లె సమీపంలో ఏనుగులు

రైతుపై గజదాడి

చంద్రగిరి, ఫిబ్రవరి 14: చంద్రగిరి మండలం, చిన్నరామాపురం పంచాయతీలోని యల్లంపల్లెలో పంట పొలాలను ధ్వంసం చేసిన ఏనుగులు ఓ రైతుపై దాడి చేశాయి.20 రోజులకు పైగా మూలపల్లి, భీమవరం, చిన్న రామాపురం, శేషాపురం అటవీ ప్రాంతంలో పంట పొలాలను ఏనుగులు ధ్వంసం చేస్తున్న విషయం తెలిసిందే.మంగళవారం రాత్రి యల్లంపల్లెకు చెందిన మనోహర్‌రెడ్డి తన పొలం వద్ద మంచంపై నిద్రిస్తుండగా ఏనుగులు దాడి చేశాయి.రైతు మనోహర రెడ్డి కేకలు వేయడంతో గ్రామస్తులు అటవీశాఖకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బాణాసంచి కాల్చి ఏనుగును అటవీ ప్రాంతంలోకి తరిమారు.గాయపడిన మనోహర రెడ్డిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. కాగా ఏనుగు దాడిలో గాయపడిన మనోహరరెడ్డిని బుధవారం చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పరామర్శించారు.

కాకర్లవారిపల్లె పొలాలపై ఏనుగుల దాడి

పాకాల: పాకాల మండలం దామలచెరువు పంచాయతీ కాకర్లవారిపల్లె సమీపంలో పంట పొలాలపై బుధవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. ఐరాల మండలం చుక్కావారిపల్లె సమీపంలో కూడా పంటపొలాలను ఏనుగులు ధ్వంసం చేశాయి.

పోలీసు సంక్షేమమూ ముఖ్యమే : ఎస్పీ



చిత్తూరు, ఫిబ్రవరి 14: పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహించే విధంగా చూడటమే కాకుండా.. వారి సంక్షేమాన్ని చూడటం కూడా తనకు ముఖ్యమేనని ఎస్పీ జాషువా అన్నారు. బుధవారం ఆయన జిల్లా పోలీసు అతిథి గృహంలో సాయుధ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఏఆర్ విభాగం క్రమశిక్షణకు మారుపేరని, ఎలాంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరగడానికి సాయుధ పోలీసుల సహకారం ఎంతో అవసరమన్నారు. అంతకుముందు ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బందిని పరిచయం చేసుకుని వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ఆరీఫుల్లా, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ ఇలియాస్ బాషా, ఎస్‌బీ సీఐ గంగిరెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎస్వీ జూపార్కుకు రెండు బెంగాల్ పులులు



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 14: తిరుపతిలోని ఎస్వీ జూపార్కుకు కొత్తగా రెండు బెంగాల్ టైగర్స్ వచ్చాయి. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలోని నవాబ్ వాజాద్ అలీషా ప్రాగ్రి ఉద్యానవనం నుంచి రెండున్నర సంవత్సరాల వయసు గల ఒక మగ పులి, ఎనిమిదన్నర సంవత్సరాల వయసున్న ఆడపులిని తిరుపతికి తీసుకువచ్చినట్లు జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. పులుల కొత్త జాతులను పెంపొందించాలనే ఉద్దేశంతో వీటిని తీసుకువచ్చామన్నారు. రెండు వారాల పాటు క్వారంటైన్‌లో ఉంచి తరువాత ప్రజల సందర్శనార్థం ఎన్‌క్లోజర్‌లో వదలడం జరుగుతుందని తెలిపారు. కాగా ఇప్పటికే జూలో 5 బెంగాల్ టైగర్స్ వున్న విషయం తెలిసిందే.

నా బిడ్డను చంపేశారు..
సాకేత్ తండ్రి నాగరాజు ఆరోపణ


మాట్లాడుతున్న నాగరాజు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 14: తన భార్య, ఆమె ప్రియుడు, శివ శంకర్‌రెడ్డి కలసి నా కొడుకు సాకేత్(3)ను చంపేశారని బిడ్డ తండ్రి నాగరాజు ఆరోపించారు. చిప్పిలి గ్రామంలో చిన్నారి సాకేత్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సాకేత్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అక్కడికి వచ్చిన సాకేత్ తండ్రి నాగరాజు మాట్లాడుతూ తన భార్య మయూరి తనతో గొడవ పడి 14 నెలల క్రితం ఇద్దరు కొడుకులను తీసుకుని వెళ్లిపోయిందన్నారు. ఆమె ప్రియుడు శివశంకర్‌రెడ్డితో కలసి చిప్పిలిలో జీవనం సాగిస్తోందన్నారు. వారి వివాహేతర బంధానికి అడ్డు వస్తున్నాడని సాకేత్‌ను హత్య చేసి, ప్రమాదావశాత్తు నీటితొట్టిలో పడి మృతి చెందినట్లు చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తే అసలు విషయం బయటపడుతుందని నాగరాజు కోరాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బి. కొత్తకోట,ఫిబ్రవరి 14: బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఈ నెల 8న గొంతుకోసుకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నరసింహులు(60)అనే వ్యక్తి బుధవారం మృతి చెందాడు. భార్యాపిల్లలు దూరం కావడంతో ఒంటరితనం భరించలేక అతడు కత్తితో పీక కోసుకొని తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు అతనిని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. దీంతో అప్పటి నుంచి తిరుపతి రుయాలో నరసింహులు చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రామసముద్రం, ఫిబ్రవరి 14: మండలంలోని చెంబకూరు కోట వీధికి చెందిన బండారి బయన్న (55)అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జరిగింది. గత మూడురోజుల క్రితం ఇల్లు విడిచి వెళ్లిపోయిన అతని కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికిన ఆచూకి లభ్యం కాలేదు. ఈనేపథ్యంలో కర్ణాటకకు చెందిన సోమయాజులపల్లె గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో బుధవారం బయన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా బయన్న ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

బాలయ్యగారిపల్లెలో కార్డెన్ సర్చ్

కలకడ, ఫిబ్రవరి 14:మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీలో బుధవారం కార్డెన్ సర్చ్ నిర్వహించినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో సోదాలు జరిపి అక్రమంగా సారా విక్రయిస్తున్న క్రిష్ణయ్య, సుబ్బయ్యలను అరెస్టు చేసి వారి నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు రిమాండుకు తరలించినట్లు తెలిపారు. దాడులో సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు

పీలేరు, ఫిబ్రవరి 14: వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు సెల్‌ఫోన్‌లలో మాట్లాడకూడదని పీలేరు ఎంవీఐ విజయ కుమారి పీలేరు ఆర్టీసీ డిపోలోని డ్రైవర్లకు సూచించారు. 35వ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పీలేరు డిపోలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ నేటికీ చాలా మంది డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లు వాడుతున్నట్లు తమ అధ్యయనంలో తేలిందన్నారు. సెల్‌ఫోన్‌లలో మాట్లాడుతూ వాహనాలు నడిపితే వాటి నియంత్రణ కష్టమవుతుందన్న సత్యాన్ని డ్రైవర్లు గ్రహించాలన్నారు. డ్యూటీ సమయంలో హడావిడిగా బస్సులు తీసుకుని బయలుదేరకుండా స్టీరింగ్, బ్రేకింగ్ సిస్టమ్, హెడ్ లైట్స్, సైడ్ ఇండికేటర్స్ వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే బస్సును తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. అనంతరం పీలేరు డిపోలో ప్రమాదరహిత డ్రైవర్లుగా గుర్తింపు పొందిన ఎస్.వాసు, ఎస్.ఎ.హక్, ఎస్.ఎం.వలీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎం బండ్ల కుమార్, గ్యారేజ్ ఇన్‌ఛార్జ్ హరినాథరెడ్డి, టీఐ సుబ్బమ్మ, స్టోర్ ఇన్‌ఛార్జ్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

భారీ అంబేడ్కర్ విగ్రహం పెట్టినా దళితులకు న్యాయమెక్కడ..?


అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న నాయకులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 14: విజయవాడలో భారీ అంబేడ్కర్ విగ్రహం పెట్టినా గ్రామాల్లో దళితులకు న్యాయం జరగడం లేదని టీడీపీ నేత కె. అమరనాథ్ ధ్వజమెత్తారు.. బుధవారం స్థానిక రామారావుకాలనీలో బహుజన భీమ్ సేన అధ్యక్షుడు శేషాద్రి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమరనాథ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దౌర్జన్యాలు పెరిగాయన్నారు. విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఆవిష్కరించినా, మారుమూల గ్రామాల్లోని పేద దళితులు అక్కడికి వెళ్లి అంబేడ్కర్‌ను దర్శించుకోలేరన్నారు. అందుకే ప్రతి గ్రామంలోను అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలాసుదర్శనం మాట్లాడుతూ అస్పృశ్యతపై పోరాడిన యోధుడే అంబేడ్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కృష్ణప్ప, వీసీకే ముత్యాల మోహన్, రేవణ మనోహర్, శ్రీనివాసులు, బీబీఎస్ నాయకులు నాగరాజు, నాగార్జున, సుధీర్, జగదీష్, వేదాంత్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపుదాం

●ఎన్నికలకు సమాయాత్తమవుదాం ● బాబు ష్యూరిటీపై విస్తృత ప్రచారం కల్పించాలి ● మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్


ములకలచెరువులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్


నిమ్మనపల్లెలో బాబుష్యూరిటీ కార్యక్రమంలో టీడీపీ నేతలు

ములకలచెరువు, ఫిబ్రవరి 14: రెండు నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సమాయాత్తమై...అరాచక, అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ పిలుపు నిచ్చారు. మదనపల్లెలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఎన్నికల సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు విజయం సాధించడం ఖాయమన్నారు. బాబు ష్యూరిటీ .. భవిష్యత్తు గ్యారంటీ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లామన్నారు. ఓటరు జాబితా పరిశీలనను, కుటుంబ సాధికార సారధుల నియామకాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ ఆదేశాల మేరకు తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న మై ఫస్ట్‌ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకుని స్వర్ణాంధ్ర సాధనలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నేతలు, నాయకులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మించలేని ప్రభుత్వాన్ని గద్దెదించాలి

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 14: రాజధానిని నిర్మించలేని అసమర్థ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని రాజంపేట అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని బండ్లపై గ్రామంలో బాబు ష్యూరిటీ..భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ఆరు పథకాలను ప్రవేశపెట్టారని వాటిలో మహాలక్ష్మి, అమ్మకువందనం, ఉచితంగా గ్యాస్ సిలిండర్, విద్యార్థులకు ప్రతి ఏడాది రూ. 15వేలు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు 1500 లను వారి ఖాతాకు జమ చేయనున్నట్లు తెలిపారు. వైసీపీ పాలనలో సామాన్యప్రజలతో పాటు నాయకులపైనా ఎన్నో కేసులు పెట్టారన్నారు. రాజధాని నిర్మించలేని వైసీపీ ప్రభుత్వాని గద్దెదించాలని కోరారు. అలాగే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు లక్ష్మన్న, చెంద్రాయుడు, వెంకటరమణ, విజయ్, గోపి పాల్గొన్నారు.

మదనపల్లెలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపు ఖాయం


చెంబకూరులో కార్యకర్తలతో మాట్లాడుతున్న రాందాస్‌చౌదరి

రామసముద్రం, ఫిబ్రవరి 14: మదనపల్లెతోపాటు రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి టీడీపీ-జనసేన అభ్యర్థుల గెలుపు ఖాయమని జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రామదాసుచౌదరి స్పష్టం చేశారు. జనంతో జనసేన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని చెంబకూరులో జరిగి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం పవన్‌కళ్యాణ్ పిలుపునిస్తే తాము వైసీపీ విముక్త మదనపల్లె, రాజంపేట పార్లమెంట్ లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, జిల్లా జాయింట్ సెక్రటరీలు సనా ఉల్లా, గజ్జల రెడ్డెప్ప, రూరల్ మండల అధ్యక్షుడు గ్రానైట్ బాబు, రామసముద్రం మండల అధ్యక్షులు చంద్రశేఖర్, విశ్వనాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శి రెడ్డెమ్మ, లవన్న, అర్జున, చంద్రశేఖర్, రాజారెడ్డి, కుమార్, జనార్దన్, నరేష్, పవన్ శంకర్, జయరాజ్, సురేష్ పాల్గొన్నారు.

సూర్య..చంద్రప్రభ వాహనంపై వెంకన్న


సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 14: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా శ్రీనివాసుడు బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలో వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరవ రోజైన బుధవారం ఉదయం 8 గంటల నుంచి స్వామి వారు సూర్యప్రభ వాహనంపై కొలువు దీరి భక్తుల గోవిందనామస్మరణల నడుమ ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ అభయమిచ్చారు. రాత్రి స్వామి వారు చంద్రప్రభ వాహననంపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, ఉప ప్రధాన అర్చకుడు కృష్ణ ప్రసాద్ భట్టర్, అర్చకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 8 గంటల నుంచి ఆలయ వాహన మండపంలో అంగరంగ వైభవంగా శ్రీనివాసుడి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం స్వామి వారు గరుడవాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయం ఇవ్వనున్నారు. కల్యాణోత్సవం అనంతరం టీటీడీ శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయించనున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

టమోటా ధరలు పతనం.. ఆందోళనలో రైతన్న

కలకడ, ఫిబ్రవరి 14: కలకడ మార్కెట్‌లో బుధవారం టమోటా ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. నెల రోజులుగా నాణ్యమైన టమోటా క్రేట్ ధర రూ.450 నుంచి 500 పలికేది. ఈ ధరతో రైతుకు కిలో రూ.30 వరకు గిట్టుబాటయ్యేది. అయితే రెండు రోజులుగా ధరలు పతనమై సగానికి తగ్గి 15 కిలోల క్రేట్ ధర రూ.250 పలుకుతోందని రైతులు తెలిపారు. మచ్చలు, రంధ్రాలు పడిన సరుకును నష్టానికి అమ్ముకోవాల్సి వస్తోందని వాపోయారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు తుఫాన్‌లు, తెగుళ్ల బారినపడి తుడిపెట్టుకుపోయాయి. రబీ సీజన్ టమోటా సాగు ఈ ప్రాంత వాతావరణం అనుకూలించదు. దీంతో ఇక్కడి రైతులు చిత్తూరు, తిరుపతి జిల్లాలోని భాకరాపేట, చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల, సోమల తదితర ప్రాంతాలకు వెళ్లి అక్కడ భూమిని లీజుకు తీసుకుని పంటను సాగు చేస్తారు. పంట సాగు ఎకరాకు రూ.2.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ధరల పతనం కారణంగా చేతికి అందే సొమ్ము కూలీలు, రవాణా ఖర్చు, మండీ కమీషన్‌లకు సరిపోతుందని వాపోతున్నారు. అనంతపురం, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలోని శ్రీనివాసపురం ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే పంట దిగుబడి ప్రారంభమైందని దీంతో డిమాండు తగ్గి ధరలు పడిపోయినట్లు వ్యాపారులు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 29 మంది ఎంజేఆర్ విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన వారితో ఎంజేఆర్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

పీలేరు, ఫిబ్రవరి 14: హైదరాబాదుకు చెందిన 'సూర్య టెక్ సొల్యూషన్స్' అనే సంస్థ తమ కళాశాలలో బుధవారం జరిపిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 29 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.4 లక్షల వేతనం అందుతుందని ఆయన తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ అవినాశ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఎంఎన్‌సీలు తమ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో 'సూర్య టెక్ సొల్యూషన్స్' సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సతీశ్, ఎంజేఆర్ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సందీప్ రెడ్డి, వివిధ విభాగాల సిబ్బంది రెడ్డిఖాసిం, చామర్తి రవి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

ములకలచెరువు, ఫిబ్రవరి 14: మండలంలోని పాత ములకలచెరువుకు చెందిన టీడీపీ కార్యకర్త నాగరాజుకు బుధవారం టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. టీడీపీ కార్యకర్త ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్నాడు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం మండలాల మాజీ మండల కన్వీనర్లు భాస్కర్‌నాయుడు, సిద్ధవరం ప్రసాద్, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ మహిళా కార్య నిర్వాహక కార్యదర్శి గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

24న సీటీఎం జాతర ప్రారంభం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 14: మండలంలోని సీటీఎం నలవీరగంగా భవాని జాతర ఈ నెల 24నుంచి 28వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు సీటీఎం సర్పంచ్ సగినాల ఆనందపార్థసారథి, ఎంపీపీ రెడ్డెమ్మ వెలుగు చంద్ర, పారపట్ల సురేంద్రరెడ్డి, వీరప్రతాప్, తెలిపారు. బుధవారం మీడియా సమావేశం నిర్వహించి, సీటీఎం జాతర కరపత్రాలను విడుదల చేశారు. జాతరను తిలకించడానికి తిరుపతి, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల నుంచి ప్రత్యేకంగా భక్తులు హాజరవుతారని వారు పేర్కొన్నారు. అలాగే ఎద్దుల పరుష ఈనెల 28 నుంచి మార్చి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులతోపాటు ఆర్బీకే చేర్మన్ శివారెడ్డి, రూపేష్ దేవ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

అన్నార్తుల ఆకలి తీరుస్తున్న ఫుడ్ బ్యాంక్‌సేవలు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 14: పుల్వామా అమరవీరుల జ్ఞాపకార్థంగా ఫుడ్ బ్యాంకును ఆర్టీసీ బస్టాండ్‌లో హెల్పింగ్‌మైండ్ సభ్యులు నిర్వహిస్తున్నారు. బుధవారం అన్నార్తుల ఆకలి తీర్చడానికి నాలుగేళ్ల మునుపు హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో ఫుడ్‌బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. మదనపల్లె, పరిసర ప్రాంతాల్లో వివిధ శుకార్యాలయంలో మిగిలన బోజనాలు వృథా చేయకుండా హెల్పింగ్‌మైండ్ సభ్యులు ఆర్టీసీ బస్టాండ్‌కు తరలిస్తారు. దీంతో చాలా వరకు అభాగ్యులకు ఆకలి తీర్చవచ్చని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఇలియాజ్, పవన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

పీలేరు, ఫిబ్రవరి 14: వేరుశనగ పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా సాగు పెట్టుబడి తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్ పేర్కొన్నారు. పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ కావలిపల్లె గ్రామంలో బుధవారం జరిగిన 'గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్(గ్యాప్) పొలంబడి కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీ మజీద్ అహ్మద్, పీలేరు ఏడీ రమణరావు, ఏవో రమాదేవి, ఆర్బీకే చైర్మన్ మల్లిఖార్జున, ఏఈవోలు నజీర్, అల్తాఫ్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ రైతు ఉపాధ్యక్షుడిగా వెంకటరెడ్డి


నియామకపత్రం అందుకుంటున్న వెంకటరెడ్డి

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 14: టీడీపీ రాజంపేట పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షుడిగా తంబళ్లపల్లె మండలం బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన మలిగి వెంకటరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు చమర్తి జగన్మోహనరాజు వెంకటరెడ్డికి నియామకపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ..రాబోయే ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపునకు అహర్నిశలూ కృషిచేస్తానన్నారు. తనకీ బాధ్యతలు అప్పగించిన మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌ను బుధవారం మదనపల్లె పార్టీ కార్యాలయంలో కలసి దుశ్శాలువలు పూలమాలతో సన్మానించారు. మాజీ ఎమ్మెల్యేకు, పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజుకు, టీడీపీ నాయకులకు వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

కురబలకోట, ఫిబ్రవరి 14: దేశరక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో పుల్వామా దాడికి నిరసనగా బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవానుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. అనంతరం వీర జవానుల ఆత్మశాంతికి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మౌనం పాటించారు. విభాగాధిపతి గీతాదేవి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ నవీన్ కుమార్, ఎన్‌సీసీ క్యాడెట్స్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడిని కలిసిన నేతలు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 14: టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజును బుధవారం టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ కార్యదర్శి బుక్కే మనోహర్‌నాయక్, బీసీ సంక్షేమ అధ్యక్షుడు బిక్కా మధుకర, బీసీ నేత మల్లికార్జున కలిశారు. రాజంపేట టీడీపీ కార్యాలయంలో పుష్పగుచ్చం అందజేసి మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. ఇటీవలె టీడీపీ జనసేన ఐక్యతగా జరిపిన సమావేశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ గెలుపు కోసం నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు పిలుపు నిచ్చారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరుగుతోంది


కిశోర్‌కుమార్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కలికిరి, ఫిబ్రవరి 14: వైసీపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత గ్రామాల్లో కూడా రోజురోజుకు పెరుగుతోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. చీకటిపల్లె పంచాయతీ రంగనాథపురం గ్రామంలో బుధవారం టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, స్వరూప్ కుమార్ రెడ్డి, సదాశివరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని దాదాపు మొత్తం కుటుంబాలన్నీ కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పసుపు కండువాలు కప్పుకుని టీడీపీలో చేరారు. వైసీపీ అరాచకాలకు గ్రామాల్లోని ప్రజలు కూడా విసిగి పోయారని, రాజధాని నుంచి గ్రామ స్థాయి వరకూ ప్రభుత్వాన్ని చీదరించుకుంటున్నారని కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ నాయకులు సి.రామ్మోహన రెడ్డి, తేజేశ్వర రెడ్డి, ద్వారకనాథ రెడ్డి, వెంకట్రమణారెడ్డి, కృష్ణా రెడ్డి, సహదేవ రెడ్డి, పి.నాగేంద్ర, సీటీఎం రమేష్, మనోహర్, నాగయ్య, వేణుగోపాల్, పవన్, నాగార్జున, వినోద్‌లతోపాటు దాదాపు యాభై కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుధాకర్ రెడ్డి, ఆర్.భాస్కర్ రెడ్డి, టీడీపీ నాయకులు స్వరూప్‌కుమార్ రెడ్డి, సదాశివ రెడ్డి, మేడికుర్తి ఆలయ చైర్మన్ శ్రీరాములు రెడ్డి, నిజాముద్దీన్, రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, వెంకటేశ్వర రెడ్డి, సతీష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం..వైసీపీని గద్దె దించుదాం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 14: యువతకు ఓటు హక్కు ఒక వజ్రాయుధం లాంటిదని ఈ ఓటుతో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సొసైటీకాలనిలోని శంకర్ నివాసంలో తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మై ఫస్ట్ వోట్ ఫార్ సీబీఎన్ కార్యక్రం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఐటీడీపీ సాగర్‌కుమార్, రాధాకృష్ణ, మనోహర్ మోహన్‌రెడ్డి రాజశేఖర్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.. **కురబలకోటలో:** తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మై ఫస్ట్ వోట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమానికి తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్ ఉందని, సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబుకు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, రాజంపేట పార్లమెంటరీ తెలుగు ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఐటీడీపీ విభాగం నాయకులు సాగర్‌కుమార్, రాధాకృష్ణ, మోహన్‌రెడ్డి, రాజశేఖర్, సోమిరెడ్డి, అమర, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమం


సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 14:పీలేరులోని తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బుధవారం 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పేరుతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీచైతన్య, మార్గదర్శి డిగ్రీ కళాశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో టీఎన్ఎస్ఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి అబ్బూరి చంద్ర బాబునాయుడు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్ననాళ్లు యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. వైసీపీ అరాచక పాలన కారణంగా రాష్ట్రంలోని విద్య, ఉపాధి రంగాలు 30 ఏళ్ల వెనక్కు వెళ్లిపోయాయన్నారు. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, బాధ్యతగా ఆలోచించి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమాల్లో రాజంపేట పార్లమెంటు టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు ముబారక్, పీలేరు నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్టీఆర్ నఫీస్, తెలుగు యువత నాయకులు క్రాంతి, రెడ్డిముని, సాధిక్, శ్రీనివాసులు, అబ్దుల్లా, శ్రీనాథ్ పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించి.. వలసలు నివారించండి


దండువారిపల్లి లో ఉపాధి కూలీలకు సలహాలు ఇస్తున్న అధికారులు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 14: వేసవిలో ఉపాధి కూలీలకు పనులు కల్పించి వలసలు నివారించాలని పెద్దమండ్యం ఎంపీడీవో వెంకటరమణయ్య సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం ఉపాధి సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు తక్కువ కావడంతో కరువు ప్రభావం వల్ల మండలంలో ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. రైతులకు ప్రయోజనకర పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎండలు వేడిమి వల్ల కూలీలకు వడదెబ్బ తగలకుండ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులలో రోజు వారిగా కూలీ రూ.272 గిట్టుబాటు అవుతున్నట్లు తెలిపారు. ఉపాధి ద్వారా రహదారుల ఇరువైపుల నాటిన మొక్కల సంరక్షణ ఉపాధి సిబ్బంది, సర్పంచులదేనన్నారు. ఉపాధి ఏపీపీ మురళి, టెక్నికల్, ఫిల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదుకు నేటితో గడువు పూర్తి


కలికిరి, ఫిబ్రవరి 14: రైతులందరూ ఈక్రాప్ నమోదుతోపాటు ఈకేవైసీ కూడా పూర్తి చేసుకోవాలని ఈ గడువు గురువారంతో ముగుస్తుందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్ తెలిపారు. బుధవారం ఆయన గుట్టపాలెం ఆర్బీకేలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలో ఇంకా వంద మంది పైగా రైతులు ఈకేవైసీ చేసుకోవలసి ఉందన్నారు. అదే విధంగా పీఎం కిసాన్ నిధులు అందని 57 మంది రైతులు కూడా ఈకేవైసీని పూర్తి చేసుకోవాలని కోరారు. ఈక్రాప్, ఈకేవైసీ పూర్తి చేసుకోని రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు, సబ్సిడీలు, రైతు భరోసా నిధులు అందవని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకిపురం ఏడీ వాణిశ్రీ, ఎంఏవో మమత, ఆర్బీకే ఇన్‌చార్జీ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

పరిహారం పెంచాలంటూ ఎన్‌హెచ్ బాధితుల డిమాండ్


ఎన్‌హెచ్ అధికారులతో వాగ్వాదం చేస్తున్న బాధితుడు

పీలేరు, ఫిబ్రవరి 14: 'కోట్లు విలువజేసే భూములను రోడ్డు కోసం కారు చౌకగా స్వాధీనం చేసుకుంటామంటే ఎలా? మాకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందజేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. పరిహారం పెంచకుంటే మేం చావనైనా చస్తాంగానీ, స్థలాలు మాత్రం ఇవ్వమంటూ అధికారులతో వాగ్వాదానికి దిగిన సంఘటన బుధవారం పీలేరులో జరిగింది. బళ్లారి-నాయుడుపేట నాలుగు లేన్ల జాతీయ రహదారి పనులు పీలేరు ప్రాంతంలో చురుగ్గా సాగుతున్నాయి. అందులో భాగంగా పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ పరిధిలో కూడా ఎన్‌హెచ్ భూసేకరణ అధికారులు కొన్ని భూములు సేకరించారు. అధికారులు గుర్తించిన భూముల్లో అధిక శాతం ప్లాట్ల రూపంలో ఉండడం, జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో వాటికి బహిరంగ మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తున్నాయి. వాటికి ఎన్‌హెచ్ అధికారులు చెల్లిస్తున్న పరిహారం తమకు ఆమోదయోగ్యం కాదని చాలా కాలంగా పలువురు బాధితులు స్థానిక రెవెన్యూ అధికారుల దగ్గర నుంచి జిల్లా అధికారుల వరకు పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆ భూముల్లో పనులు ప్రారంభించేందుకు ఎన్‌హెచ్ అధికారులు చేరుకోగా సంగతి తెలుసుకున్న పలువురు బాధిత రైతులు అక్కడకు చేరుకుని తమకు పరిహారం పెంచి ఇచ్చేంత వరకు తమ భూముల్లో పనులు ప్రారంభించకూడదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఆ భూములన్నింటినీ ఇప్పటికే భూసేకరణ చట్టం మేరకు నోటిఫై చేశామని, తమ చేతుల్లో ఏమీ లేదని అధికారులు స్పష్టం చేయడంతో బాధితులు వారితో వాగ్వాదానికి దిగారు. చేసేది లేక ఎన్‌హెచ్ అధికారులు వెనుదిరిగారు.

నైపుణ్య శిక్షణను నిరుద్యోగులు ఉపయోగించుకోవాలి


శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్లు ఇస్తున్న జీఎంఆర్ ప్రిన్సిపాల్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 14: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జీఎంఆర్ పాలిటెక్నిక్ పాఠశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో రెండో విడత స్కిల్‌హబ్‌పై శిక్షణ ఇచ్చామని డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో నాలుగు నెలల పాటు యువతకు ఉచిత శిక్షణ ఇచ్చామన్నారు. త్వరలో మరో బ్యాచ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. ఆసక్తిగల వారు 9553202509 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధి నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.